క్లుప్తంగా

విద్యుత్ సమస్యలపై 31 అర్జీలు



న్యాయ వేదికపై అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

కోటవురట్ల: మండలంలోని పలువురు విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కార న్యాయస్థానానికి దరఖాస్తు చేసుకున్నారు. ఏపీ ఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ న్యాయ వేదికకు 31 మంది తమ అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ కోర్టు జడ్జి సత్యనారాయణ, డీఈఈ ఎ.అప్పారావు, ఏడీఈ సునీల్, ఏఈ పి.పరమేశ్వరరావు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

అచ్యుతాపురం రూరల్ : పూడిమడక గ్రామానికి చెందిన యువతి అపర్ణ(19) కనిపించడం లేదని ఆమె తల్లి పున్నమల్ల ఆదిలక్ష్మి గురువారం అచ్యుతాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. అపర్ణ బ్రాండిక్స్ పరిశ్రమలో బుధవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి చేరుకుంది. తిరిగి ఇంటి నుంచి ఒంటి గంటన్నర సమయంలో వెళ్లిపోయినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ నమ్మి గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు రెండు గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

మునగపాక: మండలంలోని రెండు గ్రామాల్లో శనివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ రచ్చబండ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి 6.30 గంటలకు గంటవానిపాలెం, రాత్రి 7.30గంటలకు గణపర్తి గ్రామాల్లో జరిగే కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు రచ్చబండ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బావిని కప్పేస్తున్న వ్యక్తిపై చర్యలకు డిమాండ్



తిమ్మరాజుపేటలో బావి వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మునగపాక: ప్రజావసరాలు తీరుస్తున్న బావిని కప్పేయడం పట్ల తిమ్మరాజుపేట గ్రామస్తులు గురువారం ఆందోళనకు దిగారు. 250 కుటుంబాలకు చెందిన వారంతా తిమ్మరాజుపేటలోని బావిని వినియోగించుకుంటారని, మద్యపేటకు చెందిన వ్యక్తి స్వార్థ ప్రయోజనాల కోసం బావిని కప్పేయడం ఎంత వరకు సమంజసమని పలువురు ప్రశ్నించారు. ఏళ్ల తరబడి ఈ బావిలో నీటిని వినియోగించుకుంటున్నామని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి బావిని కప్పేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్‌తో పాటు గ్రామస్తులు కోరారు.

మోతాదుకు మించి ఎరువుల వినియోగం తగదు



మునగపాక పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఎరువుల కోసం వేచి ఉన్న రైతులు

మునగపాక: సీజన్‌లో ప్రతి రైతుకు యూరియాను అందజేస్తున్నామని మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి పేర్కొన్నారు. మునగపాక పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా సరఫరా కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియాను అందజేస్తున్నామన్నారు. యూరియా కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులు కూడా మోతాదుకు మించి ఎరువులను వినియోగించరాదన్నారు. ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

కశింకోట: బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు ఉంటాయని, వాటి నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా బాల సంరక్షణ అధికారి రమేష్ కోరారు. సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఆర్ఈసీఎస్‌లో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌమార దశలో బాలబాలికలు ఏ విధంగా నడుచుకోవాలనే విషయమై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండకుండా బాలికలు వివాహం చేసుకోవడం చట్ట రీత్యా నేరమన్నారు. వన్ స్టాప్ సెంటర్ కార్య నిర్వహణ అధికారి మంజులవాణి, పోనిక్ మనోహర్, పారా లీగల్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

- అంతంత మాత్రంగా మునగపాక పశు వైద్యశాల సేవలు
- సెలవుపై వెళ్లిపోయిన పశు వైద్యాధికారి
- రెండు నెలలుగా ఇన్‌చార్జి వైద్యురాలే దిక్కు

పడకేసిన పశు వైద్యం.!



మునగపాక ప్రభుత్వ పశు వైద్యశాల



అధ్వానంగా దర్శనమిస్తున్న పశు వైద్యశాల ప్రాంగణం

మునగపాక: పాలకుల నిర్లక్ష్యం పాడి రైతులకు శాపంగా మారింది. మునగపాక ప్రభుత్వ పశు వైద్యశాలలో వైద్యులు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ కాకపోవడంతో సేవలు అంతంతమాత్రంగా అందుతున్నాయి. వర్షాకాలంలో పశువులకు అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. మునగపాక పశు వైద్యాధికారిగా లావేటి ప్రదీప్‌కుమార్ సేవలందించేవారు. కింద స్థాయి పోస్టులను భర్తీ చేయకపోయినా పశువులకు అవసరమైన చికిత్సలు చేసేవారు. గత రెండు నెలల క్రితం ఆయన సెలవుపై వెళ్లిపోయారు. నాటి నుంచి నాగులాపల్లికి చెందిన డాక్టర్ మౌనికకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. పూర్తి స్థాయిలో ఆమె ఇక్కడ సేవలందించే అవకాశం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

భర్తీకి నోచుకోని పోస్టులు

మునగపాక ప్రభుత్వ పశు వైద్యశాలకు సంబంధించి వెటర్నరీ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను ఇంత వరకు భర్తీ చేయలేదు. హరిపాలెంకు చెందిన వెటర్నరీ విద్యార్థిని ఇక్కడ సేవలందిస్తున్నారు. సెలవులో ఉన్న వైద్యుడు ప్రదీప్‌కుమార్ తిరిగి విధుల్లో చేరడం, లేదా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తేనే గానీ సమస్య పరిష్కారం కాదు.

అధ్వానంగా ఆస్పత్రి ప్రాంగణం

పశు వైద్యశాలలో సిబ్బంది లేకపోవడంతో ప్రాంగణం అధ్వానంగా దర్శనమిస్తోంది. ఆస్పత్రి పరిసరాలు కంపు కొడుతున్నాయి. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. పశువులకు సంబంధించిన గెత్తం కూడా తీసే నాథుడే కరువయ్యాడు. ఆస్పత్రిలోని తాగునీటి బోరు చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి.

భయపెడుతున్న సీజనల్ వ్యాధులు

వర్షాకాలంలో పశువులకు పలు రకాల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉన్న ట్రైనీ విద్యార్థి కొంత మేర సేవలందించే పరిస్థితులు తప్ప.. మేజర్ సమస్యలు పరిష్కరించే అవకాశం లేదు.

6,500కు పైగా పశువులున్నా సేవలు శూన్యం

మునగపాక ప్రభుత్వ పశు వైద్యశాల ద్వారా పలు గ్రామాల పాడి రైతులు సేవలు పొందుతున్నారు. సమీప గ్రామాలైన మూలపేట, పాటిపల్లి, మంగళవరపుపేట, వాడ్రాపల్లి, నాగవరం, మల్లవరం, కుంచవానిపాలెం, కాకరాపల్లి, గొల్లపేట తదితర గ్రామాలకు సంబంధించి 6,500 వరకు పశువులు ఉన్నాయి. ఈ పశువులకు ఎటువంటి అనారోగ్య



తాగునీటి బోరు చుట్టూ పేరుకుపోయిన తుప్పలు

సమస్యలు ఎదురైనా మునగపాకకు తీసుకురావాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ పశు వెద్యాధికారి సెలవులో ఉండడం, వెటర్నరీ అసిస్టెంట్ పోస్టు భర్తీ కాకపోవడంతో రైతుల సమస్యలు వర్ణనాతీతం. అధికారులు స్పందించి తక్షణం పశువైద్యశాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలు



మునగపాక పశు వైద్యాశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు చర్యలు తీసుకుంటాం. సీజన్‌లో పశువులకు వ్యాధులు సోకకుండా రైతులు అప్రమత్తం కావాలి. పశు సంవర్ధక శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– పి.సత్యనారాయణ,తహసీల్దార్, మునగపాక

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



కోటవురట్ల తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు



ఎస్.రాయవరం: నిరసన వారం కరపత్రం విడుదల చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కోటవురట్ల: నిరసన వారం కార్యక్రమంలో భాగంగా గురువారం నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయులు కోటవురట్ల మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు ఉపాధ్యాయులు మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పింఛన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.సతీష్, సిహెచ్.శ్రీనివాసరావు, సిహెచ్.జయబాబు, తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని యూటీఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. నిరసన వారం కార్యక్రమంలో భాగంగా యూటీఎఫ్ పాయకరావుపేట మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం 25 బైకులతో ప్రచారం చేశారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయ సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ నెల 25న విజయవాడలో జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ అనకాపల్లి జిల్లా కోశాధికారి జోగ రాజేష్, పాయకరావుపేట మండల శాఖ అధ్యక్షుడు కట్టా శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శి బి.వి.వి.రమణ, సీనియర్ నాయకులు కె.ఎస్.ఆర్.కె.రాజు, జి.వి.గోపాల్, చవ్వాకుల వరప్రసాద్, వెలగా సూరిబాబు, డి.ఐజాక్, కట్టా శ్రీను, జి.వి.సతీష్, చంటి, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గుర్రాజుపేటలో నిరసన వారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కె.కె.ఎల్.ఎన్.ధర్మారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి మెమో నెంబర్ 57ను తక్షణం అమలు చేయాలన్నారు. 12వ పీఆర్సీని నియమించి ఐఆర్ ప్రకటించడం, అన్ని రకాల బకాయిలు చెల్లించడం, ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం, యాప్‌ను, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాలు రద్దు చేసి, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. వారం రోజుల పాటు చేసే నిరసన కార్యక్రమాలతో ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు.



పాయకరావుపేట:కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

రాంబిల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా చిట్టిబాబు



ఎరిపల్లి చిట్టిబాబు

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా మండలంలోని లోవపాలెంకు చెందిన మాజీ సర్పంచ్ ఎరిపల్లి చిట్టిబాబు నియమితులయ్యారు. ఈయనతో పాటు సొసైటీ సభ్యులుగా హరిపురానికి చెందిన ధూళి రమణ, భోగాపురానికి చెందిన ఉరిటి నానాజీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వ్యవసాయ పనులకు అందుబాటులో డ్రోన్



జంపపాలెంలో లబ్ధిదారునికి డ్రోన్ అందజేస్తున్న అధికారులు

యలమంచిలి రూరల్: మండలంలో వ్యవసాయ పనుల్లో వినియోగించుకునేందుకు డ్రోన్ అందుబాటులోకి వచ్చిందని మండల వ్యవసాయాధికారి పోలిమేర మోహన్‌రావు తెపిపారు. గురువారం జంపపాలెంలో లబ్ధిదారు గ్రూపు సభ్యుడు మణికంఠకు ఆధునిక డ్రోన్‌ను అందజేశారు. రూ.10 లక్షలు ధర కలిగిన ఈ డ్రోన్‌ను 80 శాతం సబ్సిడీపై అందజేసినట్టు ఆయన చెప్పారు. డ్రోగో కంపెనీకి చెందిన ఈ డ్రోన్ పురుగు మందుల పిచికారీలో రైతులకు ఇది బాగా ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎకరం పొలానికి 5 నుంచి 6 నిమిషాల్లో పురుగుమందు పిచికారీ డ్రోన్ ద్వారా పూర్తి చేయవచ్చని, రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు వ్యయం, ఇబ్బందులను తగ్గించుకోవచ్చన్నారు. రైతులకు డ్రోన్ అవసరమైనప్పుడు మండల వ్యవసాయాధికారిని సంప్రదిస్తే అందుకు తగిన ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి యూనియన్ బ్యాంక్ బ్రాంచి మేనేజర్ కృష్ణవేణి, డ్రోగో డ్రోన్ కంపెనీ ప్రతినిధి వంశీ, రైతు గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

పాడైన రోడ్డుకు మరమ్మతులు



రోడ్డు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

ఎస్.రాయవరం: గుర్రాజుపేట రోడ్డుకు మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఈ రోడ్డుపై ధర్మవరం అగ్రహారం రొయ్యల ప్రాసెసింగ్ పరిశ్రమ నుంచి లారీలతో రాకపోకలు సాగించడం వల్ల పెద్ద పెద్ద గతుకులు ఏర్పడ్డాయి. గ్రామస్తులు ఆవేదన మేరకు పరిశ్రమ యాజమాన్యం నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులపై దృష్టి సారించి సక్రమంగా పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ఆటోడ్రైవర్ల ఆందోళన



రావికమతంలో ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు, సీఐటీయు సభ్యులు

రావికమతం : ఆటో డ్రైవర్లు రోడ్డెక్కారు.మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని రద్దు చేయాలని ఆటో డ్రైవర్లు మండల కేంద్రంలో గురువారం ఆందోళన చేపట్టారు. వీరికి సీఐటీయు నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఉచిత బస్సు పథకం వల్ల ఆటోలకు బేరాలు లేక, ప్రైవేటు ఫైనాన్స్ వారి వద్ద తెచ్చిన అప్పులు చెల్లించలేక చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ వజ్రపు సత్యవతి మాట్లాడుతూ ఏటా వాహనమిత్ర పథకం కింద రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రావికమతం ఆటో యూనియన్ ప్రెసిడెంట్ కె.వరహాలబాబు మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం వల్ల ఆటోడ్రైవర్లు ఆదాయం లేక రోడ్డున పడ్డారని, ప్రభుత్వం తక్షణమే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎస్.సోమునాయుడు, సీఐటీయూ మండల కన్వీనర్ వజ్రపు సత్యవతి, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

12 నుంచి వెంకన్న పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవాలకు సిద్ధమైన వేంకటేశ్వరాలయం

రోలుగుంట : స్థానిక శ్రీ వేంకటేశ్వరాలయంలో ఈ నెల 12 నుంచి 14 తేదీ వరకూ మూడు రోజుల పాటు పవిత్రోత్సవం నిర్వహించనున్నట్టు అర్చకుడు రేజేటి శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఈ మేరకు ఆలయాన్ని పూజకార్యక్రమాల కోసం ఆలయ కమిటీ వారు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ నెల 12న శుక్రవారం సాయంత్రం 5 గంటలకు విష్వక్సేన పూజ, అంకురార్పణతో ప్రారంభమవుతాయన్నారు. 13 శనివారం ఉదయం 9 గంటలకు పవిత్రముల సమర్పణ, ముగింపు రోజు 14 ఆదివారం ఉదయం అష్టోత్తర కలశాలతో అభిషేకం జరుగుతుందని తెలిపారు. మల్లెమొగ్గ దండవలె పసుపునూలుతో హారములు చేసి స్వామివారికి సమర్పించే ఈ ఉత్సవాన్ని ఆషాఢ మాసం మొదలు కార్తీక మాసం లోపల ఏ నెలలోనైనా త్రయాహ్నికంగా జరుపుకోవచ్చని ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఈ పవిత్రోత్సవంలో పాల్గొనే భక్తుల దోషాలు తొలగి మంచి జరుగుతుందన్నారు.

శాకంబరీ దేవిగా మరిడిమాంబ



అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక ఆలయ రహదారిలోని మరిడిమాంబ ఆలయంలో అమ్మవారి నెల పండగను పురస్కరించుకుని శాకంబరీ దేవిగా గురువారం అలంకరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి నెల పండగ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు కాండ్రేగుల నాయుడు, అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు, కార్యదర్శి కాండ్రేగుల హరి కిషోర్, ఉపాధ్యక్షుడు కేఎం నాయుడు, కోశాధికారి కే శ్రీనివాసరావు, సభ్యులు కొణతాల బాలమురళీ, కర్రి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవత పండగలు



మూలపేట గంగాలమ్మ సన్నిధిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, ధర్మశ్రీ తనయుడు సూర్య



గవర్ల అనకాపల్లిలో నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



మునగపాకలో దుర్గాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం గ్రామ దేవతల పండగ ఘనంగా జరిగాయి. మూలపేటలోని గంగాలమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, నియోజకవర్గ సమన్వయకర్త ధర్మశ్రీ తనయుడు సూర్య, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు బొడ్డేడ లిల్లి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. గవర్ల అనకాపల్లిలో నూకాంబిక అమ్మవారిని సర్పంచ్ దొడ్డి మంగవేణి, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మునగపాకలో దుర్గాలమ్మ తల్లి అమ్మవారిని సర్పంచ్ దిమ్మల అప్పారావు, గ్రామస్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అధ్వానంగా వీధి రోడ్డు



పక్కా రోడ్డుకు నోచుకోని మునగపాక విశ్వబ్రాహ్మణ వీధి

మునగపాక: మునగపాక మెయిన్‌రోడ్డులోని విశ్వబ్రాహ్మణ సంఘ వీధి పక్కా రోడ్డుకు నోచుకోవడం లేదు. ఏళ్ల తరబడి ఈ రహదారి అభివృద్ధికి నోచుకోకపోవడంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాదచారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించి పక్కా రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తుప్పలతో ప్రయాణికుల తిప్పలు



పాయకరావుపేట, పెంటకోట రోడ్డులో పెరిగిన తుప్పలు

పాయకరావుపేట: మండలంలోని పలు రోడ్లలో తుప్పలు పెరిగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పాయకరావుపేట నుంచి సముద్ర తీరప్రాంతం పెంటకోట గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోయాయి. ఈ రోడ్డులో నిత్యం రాత్రి, పగలు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పాయకరావుపేట నుంచి అరట్లకోట, మంగవరం, సత్యవరం, మాసాహేబుపేట, పెద్దిపాలెం, గోపాలపట్నం, పెంటకోట, సముద్ర తీర ప్రాంతం, నక్కపల్లి మండలంలోని బంగారయ్యపేట, డీఎల్ పురం తదితర గ్రామాలకు నిత్యం ఈ రోడ్డు మీదుగా వెళ్తుంటారు. ఈ రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో ఎదురెదురుగా ప్రయాణించే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తుప్పలు పెరిగిపోయి రోడ్డు విస్తీర్ణం కుచించుకుపోయింది. సంబంధిత అధికారులు స్పందించి తుప్పలను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన రైతు మృతి



మృతుడు సత్యారావు

అచ్యుతాపురం రూరల్: మండలంలోని చీమలాపల్లిలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన రైతు నగిరెడ్డి సత్యారావు (48) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు వివరాల ప్రకారం.. సత్యారావు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే వాడు. అతడు మద్యానికి బానిసయ్యాడు.

ఈ క్రమంలో తన కుమారుడిని మద్యానికి డబ్బులడగ్గా, నిరాకరించడంతో మనస్తాపానికి గురై గత శనివారం గడ్డి మందు తాగాడు. దాంతో కుటుంబ సభ్యులు విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం వేకువజామున మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ నమ్మి గణేష్ తెలిపారు.

యూరియా కోసం రైతుల నిరీక్షణ



కె.జె.పురం సచివాలయం గేటు ముందు రిజిస్ట్రేషన్ కోసం వేచివున్న రైతులు

రావికమతం : బస్తా యూరియా కోసం మండు టెండలో అన్నదాతలు నరకయాతన అనుభవించారు. మండలంలో టి.అర్జాపురం రైతు సేవ కేంద్రంలో గురువారం యూరియా పంపిణీ చేపడుతున్నట్టు తెలుసుకున్న రైతులు ఉదయం 8గంటలకే అధిక సంఖ్యలో చేరుకున్నారు.మండు టెండలో క్యూలైన్‌లో గంటల తరబడి బారులు తీరారు. అయితే రైతుకు ఒక యూరియా బస్తా మాత్రమే ఇస్తామని వ్యవసాయశాఖ సిబ్బంది తెలిపారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం రైతు సేవా కేంద్రానికి యూరియా రావడంతో గురువారం ఉదయం స్థానిక 2 వ సచివాలయంలో ముందస్తుగా రైతులకు రిజిస్ట్రేషన్ చేశారు. గురువారం ఉదయం నుంచి రైతులు సచివాలయానికి వచ్చి ముందస్తుగా యూరియా కోసం తమ పేరు నమోదు చేసుకుని నగదు చెల్లించారు. శుక్రవారం ఆర్ఎస్‌కే వద్ద యూరియా బస్తాలు అందజేస్తామని ఏవో అనసూయ తెలిపారు.